## నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

సౌభగమ్ము చేత సంపద వచ్చిన
అహము పెక్కుపెరుగు అవనియందు
తెలివితోడ వచ్చు
కలిమియంతయుగూడ
సంతసంబునిచ్చు సత్యమిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక



### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 352 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 16-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## కాల్పుల విరమణ గడువు
# పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిది
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



2 లో

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్..

- భారత్లో చూడబడినందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం..
- భారత్లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాదం లాంచ్ ప్యాడ్ల పునరుద్ధరణ
- భారత్ లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్కు అదును ..
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్



2 లో




## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- మొదటి సంవత్సరంలో 77 శాతం
- రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా

**అమరావతి,**

ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి

-మిగతా 2 లో

## డీలిమిటేషన్ పై
# హై టెన్షన్

**నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు**

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత
- ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు

**న్యూఢిల్లీ**

పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదించారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు

-మిగతా 2 లో



## పునర్విభజన జనాభా ప్రకారమే


- రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
- సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**వరంగల్,**

: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు

-మిగతా 2 లో



## దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు లేవు

- అధికారికంగా ప్రకటించిన కేంద్రం


**న్యూఢిల్లీ,**

దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఏవీ లేవని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారిక ప్రకటనలో తెలియజేసింది. భారత దేశంలో వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ) ఉద్భవించి ఐదు దశాబ్దాలకు పైగా గడిచిందని, ప్రస్తుతం వారి ప్రభావం దేశంలో ఎక్కడా లేదని కేంద్రం తెలిపింది.దేశంలో నక్సల్స్ ప్రభావం ఉన్న తొమ్మిది రాష్ట్రాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని తెలిపిందని అధికారులు వెల్లడించారు. 'దేశంలోని ఏ జిల్లా కూడా ఇకపై ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత క్యాటగిరీలో లేదు' అని ఆ ప్రకనటలో పేర్కొన్నది. కాగా, దేశాన్ని మావోయిస్టు రహితంగా తీర్చిదిద్దినట్టు హోం మంత్రి అమిత్ షా మార్చి 30న పార్లమెంట్‌లో ప్రకటించారు.

-మిగతా 2 లో

## తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు

- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ



**హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్,

-మిగతా 2 లో

## నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం

- దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు
- తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు



**చెన్నై**

దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె.

-మిగతా 2 లో

## కుల కార్పొరేషన్ల'
# భర్తీకి గ్రీన్‌సిగ్నల్

**ఒకట్రెండు రోజుల్లో జీవో**



- మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం
- పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

**హైదరాబాద్**

అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు.

-మిగతా 2 లో



## మహిళా బిల్లుకు ఓకే ...
## డీలిమిటేషన్ బిల్లుకు నో

- రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోంది
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతాం
- వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

**న్యూఢిల్లీ,**

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారండిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు.

-మిగతా 2 లో



## దక్షిణాదికి అన్యాయం
# చేస్తే పెను ఉద్యమం

- మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు
- నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ,

-మిగతా 2 లో

## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిది
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్,**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## పునర్విభజన జనాభా ప్రకారమే

మొదటి తరువాయి

సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు లేవు

మొదటి తరువాయి

దేశంలో నక్సలిజాన్ని మార్చి 31నాటికి అంతం చేయాలనే లక్ష్యంతో కేంద్రం నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమైందని ఆయన చెప్పారు.

## తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు

మొదటి తరువాయి

మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది.నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

## నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం

మొదటి తరువాయి

స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి.

## మళ్లీ తోక జాడిస్తున్న పాక్..

- భారత్లో చూడబడినందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం..
- భారత్లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాదం లాంచ్ ప్యాడ్ల పునరుద్ధరణ
- భారత్ లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్కు అదును ..
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్



జమ్మూకశ్మీర్ లో మరోసారి అలజడి సృష్టించడం కోసం పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదుల ను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం కలిసి ఈ ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు (బుధవారం) హెచ్చరించాయి. ఉగ్రవాదులను చొప్పించడం కోసం పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉంది. అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా భావించి పాకిస్థాన్ ఈ కుట్రకు పాల్పడుతోందని నిఘా విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం ఉన్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దాంతో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున గ్రూపులుగా ఉగ్రవాదులను పంపి భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని పాకిస్థాన్ చూస్తోంది. ఇలాచేస్తే కొందరైనా భారత్‌లోకి చొరబడగలరని పాకిస్థాన్ భావిస్తోంది. గత ఏడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దాంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

## డీలిమిటేషన్ పై హై టెన్షన్

మొదటి తరువాయి

వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది

## కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగ్నల్

మొదటి తరువాయి



ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవే...' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే కార్పొరేషన్ ఛైర్మెన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ జాబితాను సాధ్యమైనంతగా వడబోసి, పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసి, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని సీఎం భావిస్తున్నారు. వారిలోంచి మొదటి దఫాగా 20 నుంచి 25 మందికి పదవులను కట్టబెట్టాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు ప్రాధాన్యతనిస్తూనే రెడ్డి సామాజిక తరగతిని కూడా 'సంతృప్తి' పరిచే విధంగా జాబితాలను సిద్ధం చేయాలని సీఎం... పీసీసీ చీఫ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

మొదటి తరువాయి

మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. "ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు.

## మహిళా బిల్లుకు ఓకే ... డీలిమిటేషన్ బిల్లుకు నో

మొదటి తరువాయి

ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు.

# వంగూరులో పశువులకు ఎఫ్.ఎం.డి టీకాలు



**వంగూరు,ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉల్పర గ్రామంలో పశువుల డాక్టర్ వై. మల్లేష్ ఆధ్వర్యంలో ఎఫ్.ఎం.డి వ్యాక్సిన్ గాలికుంటు టీకాలు పశువులకు వేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య, వార్డు సభ్యులు, జేవివో మహేష్, ఎల్.ఎస్.ఏ లక్ష్మణ్, ఓఎస్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# టిడిపి పొలిట్‌బ్యూరోలోకి మరోసారి బక్కని నరసింహులు



**షాద్‌నగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టిడిపి మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మరోసారి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా అవకాశం పొందారు.అమరావతిలో బుధవారం టిడిపి అధిష్టాన వర్గం ప్రకటించిన జాబితాలో ఆయన పేరు మరోసారి చోటు చేసుకుంది.

# గ్యాస్ కష్టాలతో రోడ్డెక్కిన వినియోగదారులు



**షాద్‌నగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంట గ్యాస్ సరఫరాలో తీవ్ర జాప్యం కారణంగా వినియోగదారులు ఆవేదనతో రోడ్డెక్కారు. షాద్‌నగర్--పరిగి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కొందుర్గు మండల కేంద్రంలోని భవాని గ్యాస్ ఏజెన్సీ గత పదిహేను రోజులుగా సిలిండర్ల సరఫరా నిలిపివేసిందని వినియోగదారులు ఆరోపించారు. తమ పనులను వదులుకుని ఏజెన్సీ కార్యాలయం ముందు గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో చివరకు ధర్నాకు దిగామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతోనే ఈ ఆందోళనకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు.వెంటనే పెండింగ్‌లో ఉన్న సిలిండర్లను సరఫరా చేయాలని, సివిల్ సప్లై అధికారులు రంగంలోకి దిగి ఏజెన్సీ పనితీరుపై పర్యవేక్షణ చేపట్టాలని, వంట గ్యాస్ కొరతకు శాశ్వత పరిష్కారం చూపాలని వినియోగదారులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# 19న ప్రారంభంకానున్న శ్రీ దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవాలు



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవం ఈ నెల 19 నుండి 21 వరకు జరగనుందని ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్ తెలిపారు.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, గణపతి హోమం, సాయంత్రం రాజోపచార పూజ నిర్వహించనున్నారు. సోమవారం అమ్మవారికి పంచామృత అభిషేకం, జగత్రసూతి అలంకరణ, చండీహోమం, సుబ్రహ్మణ్య హోమం, సౌందర్యలహరి, శివానందలహరి పారాయణం, మహా హారతి, సాయంత్రం శ్రీ సుందరేశ్వర స్వామి వారి ఎదురుకోళ్ళు జరుగుతాయి. మంగళవారం జగద్గురు శంకరాచార్య జయంతి సందర్భంగా విశేష అభిషేకం, హారతి, స్తోత్ర పారాయణం, రుద్రహోమం, మహా పూర్ణాహుతి నిర్వహించి, అనంతరం శ్రీ దుర్గాభవానీ--సుందరేశ్వరుల కల్యాణం ఘనంగా జరగనుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

# తెలుగు జానపదం బిరుదు రాజు రామరాజు

బిరుదు రాజు రామరాజు హై స్కూల్ విద్యార్థిగా ఉన్న నాటి నుండి, "భారతి" మొదలైన పత్రికలలో మానవల్లి, వేటూరి, నిడదవోలు, మల్లంపల్లి, వంటి పరిశోధకుల వ్యాసాలు, వారు సంపాదించిన గ్రంథములు పీఠికలు చదివాడు. వారిలాగే సాహిత్య లోకానికి తెలియని క్రొత్త విషయాలు తాను కూడా చెప్పాలని నిశ్చయంతో పరిశోధన రంగంలో అడుగు పెట్టాడు. జానపద విజ్ఞానంలో విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో దక్షిణ దేశభాషలన్నింటిలోనూ, బిరుదు రాజు రామరాజు యొక్క "తెలుగు జానపద గేయ సాహిత్యం" మొదటి సిద్ధాంత గ్రంథం అయింది. జానపద గేయ రంగంలో అనేక జానపద గేయాలు సంకలనాలు బిరుదరాజు రామరాజు ప్రకటించాడు. తెలుగులో, ఇంగ్లీషులో, జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనాత్మక పత్రాలు, రామరాజు చదివాడు. ఇంగ్లీషులో "ఫోక్ టేల్స్ ఆఫ్ ఏ పి." ఫోక్ లోరు ఆఫ్ ఏ పి. సౌత్ ఇండియన్ ఫోక్ సాంగ్స్, గ్లింప్సెస్ ఇన్ టూ, తెలుగు ఫ్లోక్ లోర్,అనే గ్రంథాలు బిరుదు రాజు ప్రకటించాడు. బిరుదు రాజు తెలంగాణ అంతా తిరిగి వందల కొద్ది తెలుగు, సంస్కృతంలో ఉన్న తాళపత్ర గ్రంథాలు, పదులకొద్దీ, శిలా శాసనాలను, సేకరించాడు. అచ్చు కాకుండా పడి ఉన్న తెలుగు, సంస్కృత కావ్యాలను దాదాపుగా నూరింటిని సాహిత్య ప్రపంచానికి తెలియజేశాడు. మరుగున పడిన మాణిక్యాలు, చరిత్రకి ఎక్కనీ చరితార్థులు, అనే పేరుతో అనేక వ్యాసాలు పత్రికల్లో బిరుదు రాజు రాశాడు. పరిష్కరించిన, గ్రంధాలు:- సంస్కృతంలో కాళహస్తి కవి రచించిన 'వసు చరిత్రం' మధురవాణి రచించిన రామాయణ సార తిలకం, వెల్లలా ఉమామహేశ్వర్లు 'శృంగార శేఖర బాణం' శ్రీకృష్ణదేవరాయల జాంబవతి పరిణాయ నాటకం, మొదటిసారిగా పరిష్కరించిన బిరుదు రాజు అనంత రామయ్య, సీతా విజయ చంపు వంటి సంస్కృత కృతులను బిరుద రాజు రామరాజు పరిష్కరించాడు.



**తెలుగు గ్రంథాల పరిష్కరణ :-** తెలుగులో బొడ్డు చర్ల చీన తిమ్మ కవి 'ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం' చింతపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయం, వెంకటాద్రి నాయకుని సకల జీవసంజీవనం, పాల్కురికి సోమనాథుని, పండిత రాద్యోదాదహరణం, అనే కావ్యాలను మొదటగా సేకరించి ప్రకటించారు. బిరుదు రాజు రామరాజు, "ఉర్దూ తెలుగు నిఘంటువు"ను కూర్చారు. ఇంగ్లీష్ హిందీల నుండి నాలుగు గ్రంధాలు అనువదించాడు. బిరుదు రాజు పర్యవేక్షణలో 38 మంది ఎంఫిల్, పి హెచ్ డీలు సంపాదించారు.

తెలుగు జానపద విజ్ఞాన రంగంలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి ఆచార్య బిరుదు రాజు రామరాజు, పరిశోధకుడిగా, పండితుడిగా, ఆచార్యుడిగా, జాతీయ వక్తగా ప్రసిద్ధి పొందిన ఈయన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో 1925 ఏప్రిల్ 16న జన్మించాడు. దేవునూరు, మడికొండ, హనుమకొండలో ప్రాథమిక విద్య మాధ్యమిక విద్యతోపాటు ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తరువాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంగ్లీష్ మీడియం లో బిఏ పూర్తి చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తెలుగు, ఖండవల్లి లక్ష్మీ రంజనం పర్యవేక్షణలో పిహెచ్ డి పూర్తి చేశాడు. 1952 లో ఉస్మానియా తెలుగు శాఖలో అధ్యాపకుడిగా చేరి రీడర్ గా, ప్రొఫెసర్ గా పదోన్నతి పొందాడు. 1973 నుంచి 1983 వరకు తెలుగు శాఖ అధ్యక్షులుగా కొనసాగాడు.1967 నుంచి 1974 వరకు వరంగల్ స్నాత కోత్తర కేంద్రంలో పనిచేసిన బిరుదరాజు రామరాజు 1983లో పదవి విరమణ పొందాడు.

తెలుగు జానపద గేయ సాహిత్యం పై పిహెచ్ డి చేసి ఆ రంగంలో ఎందరికో మార్గదర్శకుడయ్యాడు. జానపద సాహిత్య పరిశోధన దక్షిణ భారతదేశ భాషల్లో నే మొదటి పరిశోధనగా గుర్తింపు పొందింది. బిరుదు రాజు రామరాజు వందల కొద్ది జానపద గేయాలను, అనేక తాళపత్ర గ్రంథాలను, శిలాశాసులను సేకరించాడు. ప్రాచీన కావ్యాలను పరిష్కరించాడు. ఆంధ్రదేశంలోని యోగుల చరిత్రను సేకరించి పుస్తకాలను నిలవరించాడు. ఈయన చేసిన సాంస్కృతిక సేవగాను జాతీయాచార్య పదవి లభించింది. 2010 ఫిబ్రవరి 8న హైదరాబాదులో మరణించాడు. జానపద సాహిత్యాన్ని, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన బిరుదు రాజు రామరాజు, తెలుగు జానపద సాహిత్యం అంటేనే బిరుదు రాజు రామరాజు అని చెప్పుకోవచ్చు.

**ఏప్రిల్ 16 బిరుదు రాజు రామరాజు శతజయంతి సందర్భంగా**

దేవులపల్లి రమేశ్,
సిద్దిపేట, నంగునూర్
9963701294



# వేసవికి ఉపశమనంగా ఉచిత పెరుగన్నం పంపిణీ




**షాద్‌నగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ మూడు వేల మందికి ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది.రెండో రోజు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు ఆయన సతీమణి బత్తుల మాధవి స్వయంగా పంపిణీ చేశారు. జూన్ 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ర్యాకల్ దేవ్‌పల్లిలో చలివేంద్రం ప్రారంభం



**ఎలిగేడు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలు నీటిని ఎక్కువగా తాగాలని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగే శివకృష్ణ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం - సీఎం రిలీఫ్ ఫండ్





**మంచాల, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మార సురేష్ పంపిణీ చేశారు.ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మార సురేష్ మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని, అందరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఈ సహాయం మంజూరైనట్లు తెలిపారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రజాప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిలమోని శ్రీనివాస్, ఆర్ల శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్, గొరిగే కృష్ణ, ఆలంపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేటర్లకు జనగణనపై శిక్షణ

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆళ్లగడ్డలోని వైసీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో సూర్జహాన్ పాల్గొని జనగణన, ఇండ్ల గణన నిర్వహణపై అవగాహన కల్పించారు. గణాంకాల సేకరణ దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు సంజీవ్ కుమార్, కృష్ణ శాస్త్రి గణన విధానంపై సిబ్బందికి వివరించారు. పక్కాగా వివరాలు సేకరించాలని సూచించారు.

# 'జీడీపీ 7.6 వృద్ధి శాతంతో భారత ప్రయాణం"




కేంద్ర గణాంకాల శాఖ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అంచనవేస్తూ ప్రపంచీకరణ వృద్ధిపై ఆలోచింపచేస్తూ ప్రపంచ దేశాలన్నిటికీ మార్గంగా నిలుస్తున్న భారత దేశాన్ని వృద్ధి పంతం లో నిలిపేందుకు కేంద్ర గణాంకాల సంస్థ "2025బి26 కాలానికి భారత దేశ జీడీపీ వృద్ధి రేటు అంచనాను 7.6 శాతానికి అంచనా వేసింది. దానిలో భాగంగానే అంతకంతకు విస్తరిస్తున్న జనాభా వృద్ధి రేటును అంచనా వేసుకొని కాలానికి తగ్గట్టు మారుతున్న ద్రవ్యోల్బణ స్థితులను అంచనా వేసుకొని అంతకు ముందు అనుసరిస్తున్న 2011బి12 ఆధార సంవత్సరాన్ని కేంద్ర గణాంక శాఖ 2022బి23 సంవత్సరానికి మార్చింది . 2024బి25 లో నమోదైన 7.4 శాతం వృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈసారి 7.6 శాతానికి జీడీపీ వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అన్నిటికంటే ముఖ్యమైన మరో అంశం"ద్రవ్యోల్బణం " ద్రవోల్బణం అనేది ఒక దేశ ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించి పరుగులు పెట్టించాలన్న లేదా ఆ దేశం దివాళా తీయాలన్న ద్రవ్యోల్బణం పై ఆధార పడి ఉంటుంది ఎందుకంటే మన పక్కన ఉన్నట్టు వంటి దాయాది దేశం పాకిస్తాన్న యొక్క అనాలోచిత నిర్ణయాల వల్ల విపరీతమైన ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకడంతో ఆర్థిక అత్యవసర పరిస్థితి పాకిస్తాన్ లో ఏర్పడింది అక్కడ ఒక్క లీటర్ పెట్రోల్ 450 రూపాయలకు చేరింది అంటే చూడండి ఆర్థిక అస్థిరత ఎంతలా మారిపోయిందో. ఎందుకంటే ఏదైనా అభివృద్ధి చెందుతున్న దేశాలలో విపరీత ద్రవ్యోల్బణం పెరుగుదల అనేది ఆ దేశం యొక్క వృద్ధి గమ్యానికి అడ్డు గా మారుతుంది. నిత్యవసర సరుకుల ధరలు ఉన్న ధరకి 10 రెట్లు పెరిగి మార్కెట్ అస్థిరత ఏర్పడి ప్రజలలో తీవ్ర ఆర్థిక మాంద్యానికి దారి తీస్తుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రముఖ భారత ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వర్ ద్రవ్యలోటు 2025బి26 కాలానికి జీడీపీ లో 4.4 శాతానికి నమోదు అయ్యే విధంగా నిర్దేశించారు. ద్రవ్యలోటు అనేది 4 శాతానికే పరిమితం అవడం మన దేశానికి ఆర్థిక ఎదుగు దళకూ మంచి తోడ్పాటు వంటిది. మారుతున్న కాలానికి తగ్గట్టు ఆర్థిక సంస్కరణలు చేయడం ప్రభుత్వాలపై ఎంతైన ఉంది 2024బి25 లో నమోదైన జీడీపీ విలువ స్థిర ధరల వద్ద 300 లక్షల కోట్లుగా ఉంది ఈ విలువను 323 లక్షల కోట్ల వాస్తవ జీడీపీ విలువగా మార్చడం ప్రభుత్వం లక్ష్యంగా ఊహించుకుంది . ప్రపంచంలోని అన్ని దేశాల కంటే అధిక జీడీపీ వ్యవస్థతో ముందుకు వెళ్తున్న భారతానికి ప్రస్తుతం నెలకొంటున్న యుద్ధ పరిస్థితులు, ఉగ్రవాద చర్యలు భారతానికి ఆటంకాలు కలిగించే అంశాలు. అయిన సరైన నాయకత్వ వ్యవస్థతో ముందుకు వెళ్తే అన్ని పరిస్థితులను చక్కదిద్దుకుంటూ దేశాన్ని వృద్ధి పథంలో నిలుపవచ్చు.

మీ
గోరుపాటి శంకర్
అసోసియేట్ ఎడిటర్
రచయిత, జర్నలిస్టు



## నగర అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు - కేటీఆర్



**మేడ్చల్--మల్కాజ్గిరి, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఘనంగా జరిగింది. మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే చామకురా మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ చేతుల మీదుగా 150 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మాజీ కార్పొరేటర్లు కండువా కప్పుకొని బిఆర్ఎస్‌లో చేరారు. సభలో మాట్లాడుతూ ఆయన, గత రెండేళ్లలో హైదరాబాద్ అభివృద్ధి నిలిచిపోయిందని, రేవంత్ రెడ్డి నగరాన్ని నిర్లక్ష్యం చేసి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టారని విమర్శించారు. వచ్చే రెండున్నర ఏళ్లలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, బిఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మంద సంజీవరెడ్డి, సామల బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ బిజెపి అధ్యక్షుడి ఆత్మహత్య



**సరూర్‌నగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ మండల కేంద్రంలోని బడంగ్‌పేట్ బిజెపి అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన ఘటన స్థానికులను కలచివేసింది.ప్రజల సమస్యలపై పోరాడుతూ మంచి పేరు సంపాదించిన ఆయన, బడంగ్‌పేట్ సర్కిల్‌లో అవినీతిపై పోరాడి 150 కోట్ల స్కామ్‌ను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అకస్మాత్తుగా జరిగిన ఈ మృతి పలు అనుమానాలకు తావు కల్పిస్తోంది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదలకు అండగా సర్పంచ్ లక్ష్మమ్మ



**మహేశ్వరం, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకోల్ గ్రామంలో అర్హత గల లబ్ధిదారుడు అరడి చిన్న అంజయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఇల్లు వద్ద సంప్రదాయబద్ధంగా ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవారికి అండగా ఉంటామని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ జనార్దన్ గౌడ్, కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆమనగల్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



**ఆమనగల్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి అని ప్రిన్సిపాల్ ప్రొ. శర్వాణి తెలిపారు.మొదటి దశలో ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయి. వెబ్ ఆప్షన్లు ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు అందుబాటులో ఉంటాయి. సీట్ల కేటాయింపు మే 14న జరగనుంది. అనంతరం మే 15 నుంచి 23 వరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవలసి ఉంటుంది.ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తు విద్యా ప్రయాణాన్ని ప్రారంభించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మర్రిగూడ, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ గ్రామంలో మహిళా సంఘం ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాసు, మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి అనిల్ కుమార్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.గ్రామ రైతులకు దొడ్డురకం, సన్నరకం వడ్లను సులభంగా విక్రయించే అవకాశం కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యమని అధికారులు తెలిపారు.

## హిందూ సమ్మేళన గోడపత్రిక ఆవిష్కరణ



**మర్రిగూడ, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏప్రిల్ 21న జరగనున్న హిందూ సమ్మేళన గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల భాగంగా మర్రిగూడ చౌరస్తా పిఎంఆర్ పాఠశాలలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. హిందూ సమాజాన్ని ఏకం చేయడం లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, సామాజికవేత్త గుమ్మకొండ విఠల్ రెడ్డి, అర్చకులు ఎల్వి శర్మ, లోక సాయినాథ్, విజయ రామారావు, మాస చంద్రశేఖర్, యాదయ్య, చెరుకు శ్రీరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

-- ఎంఈవో నరేంద్రచారి



**ఎలిగేడు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి నరేంద్రచారి అన్నారు. ధూళికట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ ర్యాకం లచ్చయ్య ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న తరుణంలో బుధవారం ఆత్మీయ సన్మాన సభ జరిగింది. విద్యాశాఖలో 41 ఏళ్లపాటు సేవలందించి అందరి మన్ననలు పొందారని ఎంఈవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లచ్చయ్య--సుగుణ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి -- ఎస్సై మధుకర్



**ఎలిగేడు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని ఎలిగేడు ఎస్సై మధుకర్ సూచించారు.ధూళికట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులను తప్పక పాటించాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో ఎంఈవో నరేంద్రచారి, హెచ్ఎం బిజిలి సదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో ఏసీబీ దాడి అసిస్టెంట్ ఇంజనీర్ అరెస్ట్



**కరీంనగర్ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీలో భారీ అవినీతి వెలుగులోకి. వచ్చింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు. చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ నుసుమ్ సుధాకర్ రెడ్డి రూ.50,000 లంచం. తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. వర్షపు నీటి కాలువ పనుల బిల్లును ప్రాసెస్. చేయడానికి లంచం డిమాండ్ చేసినట్లు. సమాచారం. ఫిర్యాదిదారుని ఫిర్యాదు. మేరకు ఏసీబీ అధికారులు ఉచ్చుపట్టి పట్టుకున్నారు.నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా,కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# జై కిసాన్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కొత్త మహేష్




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
16వ డివిజన్ మల్కాపూర్ జై కిసాన్ రైతు సంక్షేమ సంఘం ఎన్నికల్లో కొత్త మహేష్ ఘన విజయం సాధించారు. మాజీ అధ్యక్షుడు గుంటపల్లి రవికుమార్‌పై పోటీ చేసి 115 ఓట్లు సాధించిన మహేష్, 45 ఓట్లు పొందిన రవికుమార్‌ను అధిగమించారు.163 మంది సభ్యుల్లో 160 మంది ఓటు హక్కు వినియోగించగా, ప్రధాన కార్యదర్శిగా పల్లె సంతోష్ కుమార్, కోశాధికారిగా గంగాధర నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గం సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఎన్నికల్లో విజయం సాధించిన మహేష్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారిగా నరహరి లక్ష్మారెడ్డి, పర్యవేక్షకులుగా కాంతాల జగన్ రెడ్డి, కాసారపు శ్రీనివాస్ వ్యవహరించారు.

# ప్రమాదకరంగా మారిన కరెంట్ స్తంభం

**గన్నేరువరం, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మైకుల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఒక పక్కకు ప్రమాదకరంగా ఒరిగి ఉండటం గ్రామస్తుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఈ విషయంపై కమిటీ సభ్యులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారాహిత్యంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు, కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ప్రమాదం జరిగాకే స్పందిస్తారా ప్రాణనష్టం జరిగిన తరువాతే చర్యలు తీసుకుంటారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కమిటీ తక్షణ చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో జరిగే పరిణామాలకు వారు బాధ్యత వహించాల్సి వస్తుందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని, ఆలయ పరిసరాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు

**పాలకుర్తి, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



రామగుండం సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు బసంతనగర్ ఏఈ మానాల ప్రసాద్ తెలిపారు.ఈ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ల మార్పు, ఓల్టేజి హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, పనిచేయని మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు--కేటగిరి మార్పు, సర్వీసు రద్దు వంటి సమస్యలను వ్రాతపూర్వకంగా అందజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు చైర్‌పర్సన్ వేణుగోపాల చారి, టెక్నికల్ మెంబర్ కే. రమేష్, ఫైనాన్స్ మెంబర్ ఎన్. దేవేందర్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం. రామారావు హాజరుకానున్నారు. బసంతనగర్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# సోషల్ వెల్ఫేర్ వార్షిక డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త





- మినిస్టీరియల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించండి
- రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ వార్షిక డైరీ 2026ని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షిక డైరీ ని రూపొందించడం అభినందనీయమని, డైరీని సమగ్ర సమాచారంతో ఉపయోగకరంగా ఉందని కలెక్టర్ కుష్బూ గుప్తా అసోసియేషన్ ను అభినందించారు. రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా పరిధిలో దీర్ఘకాలంగా ఉన్న సిబ్బంది పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ స్టేట్ కన్వీనర్ నీరటి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమతి కె.కవిత, పూజారి నర్సింలు బి.రాజేంద్రప్రసాద్, కూన స్కైలాబ్, గంజి శ్రీనివాసులు, ముత్యాల రవీందర్, కిరణ్ కుమార్, మంచాల తిరుపతి, సిహెచ్.అవంతి, ఏ.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మొట్టమొదటి మహిళా సమాఖ్య సంఘ భవనం ప్రారంభం

-కొత్తపల్లి గ్రామంలో ప్రారంభం.
-"మహిళల ఆర్థిక సాధికారతకు మహిళా సమాఖ్య సంఘాలు కీలకం."
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నేరేడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని మహిళా సంఘాలు మరియు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఆయన మాట్లాడుతూ
గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంత భవనాలు అవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తన వంతు కృషి చేస్తానని, మహిళల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కొత్తపల్లి, గుర్రపు తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి,ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. ఇల్లు ప్రతి కుటుంబానికి పెద్ద ఆస్తి అని, ఇలాంటి పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గుర్రపు తండా గ్రామ పంచాయతీ పరిధిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.రైతులు పండించిన వడ్లకు సరైన ధర లభించేందుకు ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు.మధ్యవర్తుల ద్వారా రైతులు నష్టపోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకోవడం వల్ల వారికి అధిక లాభం చేకూరుతుందని చెప్పారు.కొత్తపల్లి మరియు పరిసర గ్రామాల రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.రైతులు తమ పంటను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.
నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన పై మండల స్థాయి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడం, గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయడం మా ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. నేరేడుగొమ్ము మండలంలో రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవితాలను మరింత సుఖవంతం చేస్తాం.రైతు బీమా మాదిరిగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి బీమా సదుపాయాన్ని కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇట్టి పథకాన్ని జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు,రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ గ్రామ సర్పంచులు,ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం



**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన అండేకర్ యాదిలాల్ ను మరియు ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి కానం గణేష్ గౌడ్ లను టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ బార్ అసోసియేషన్ సభ్యులను పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్యా నాయక్, గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మాలె మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 33 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

**కరీంనగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి మూడు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా సేవలందించిన మంద శ్రీధర్ పదవీ విరమణ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ జరిగింది.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన శ్రీధర్ తన 33 ఏళ్ల సుదీర్ఘ సేవలో అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో శ్రీధర్‌కు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ, తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా వ్యవహరించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి, కమిషనరేట్‌కు చెందిన ఇతర అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.శ్రీధర్ సుదీర్ఘ సేవలు పోలీస్ శాఖ చరిత్రలో నిలిచిపోతాయని అధికారులు పేర్కొన్నారు.

## ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్




**కరీంనగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి విడుదల చేసిన 'దోస్త్' నోటిఫికేషన్ నేపథ్యంలో, కరీంనగర్‌లోని ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభమైంది.కళాశాల ప్రతినిధులు అధికారికంగా ప్రారంభించిన ఈ కేంద్రం ద్వారా ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరించనుంది. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే ఈ హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదించాలని దోస్త్ కోఆర్డినేటర్ రామకృష్ణ సూచించారు.ఈ సెంటర్ విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.

## జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో కరీంనగర్ విద్యార్థినుల ప్రతిభ



**కరీంనగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మూ & కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి టచ్ రగ్బీ ఛాంపియన్‌షిప్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల, హుజూరాబాద్‌కు చెందిన విద్యార్థినులు విశిష్ట ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించారు. ఈ విజయంతో కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.ఆటగాళ్ల ప్రయాణానికి సంబంధించిన రిజర్వేషన్, ఇతర సౌకర్యాల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారం అందించగా, విద్యార్థినులు పోటీల్లో పాల్గొని విజయాన్ని సాధించగలిగారు. తిరుగు ప్రయాణంలో న్యూఢిల్లీలో ఇండియా గేట్ వద్దకు వెళ్లి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.కరీంనగర్ విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ బండి సంజయ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి సహకరించిన తెలంగాణ టచ్ రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. ప్రవీణ్, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు టీ. చిరంజీవి చారి, కార్యదర్శి రంగు నిరంజనాచారి, సంయుక్త కార్యదర్శి, పి.ఇ.టి చిరుత కవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే. సాయి రాహుల్‌ను కూడా విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కరీంనగర్ జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

## హెచ్‌పీవీ టీకా వేయించాలి..

- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హెచ్‌పీవీ వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ అన్నారు. బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ను పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్‌కు వేల రూపాయలు ఖర్చవుతుండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కావునా అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, డాక్టర్ మైమున బేగం, తిరుపతి రెడ్డి మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, నాయకులు అబ్దుల్ ఖాదర్, దేవరశెట్టి మహేష్ మరియు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికీ చెందిన గుద్దేటి శోభా చంద్రమౌళి ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఎల్లయ్య ఇంటి నిర్మాణానికి సిమెంట్‌తో పాటు ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేదలను ఆదుకోవడమే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ట్రస్ట్ తరపున ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్క లాలయ్య, వార్డు నెంబర్ దోనాదుల రామకృష్ణ, మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ కొడిగని శ్రీశైలం, రాగి చంద్రయ్య, ఈర్లపల్లి శేఖర్, ఒగ్గు వెంకటయ్య, కొడిగని కృష్ణయ్య, సిరిగని మహేష్, రాగి నరసింహ, ఒగ్గు రామకృష్ణ, సిరిగని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు బారికేడ్‌ల అందజేత




**హుస్నాబాద్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని హుస్నాబాద్ మెడికల్ ఫార్మసీ ప్రారంభించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, ఫార్మసీ యాజమాన్యం పోలీస్ శాఖకు 15 చెక్‌పోస్ట్ బారికేడ్‌లను అందజేసింది. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఫార్మసీ యాజమాన్యాన్ని అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఫార్మసీ యజమానులు ఆంజనేయులు, వేణు, తిరుపతి, మహేంద్ర, నరేష్ పాల్గొన్నారు.స్థానిక పోలీస్ శాఖకు అవసరమైన సదుపాయాలను అందించడంలో ప్రజల సహకారం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

## 9వ రోజుకు చేరిన కరెంట్ ఉద్యోగస్తుల సమ్మె



**మంథని, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మంథని డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న కరెంటోల్ల నిరవదిక సమ్మె 9వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఆర్టిజన్, అన్‌మాండ్, పీస్ రేట్ కార్మికులు గత ఆరు నెలలుగా పలు దఫాలుగా నిరసనలు తెలుపుతూ, ఈనెల 8వ తేదీ నుండి ప్రధాన ట్రేడ్ యూనియన్ల మద్దతుతో సమ్మెలోకి ప్రవేశించారు. ఆర్టిజన్ల స్టాండింగ్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్సీఈబి రూల్స్ వర్తింపజేయాలని, అన్‌మాండ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, పీస్ రేట్ కార్మికులకు జీఓ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమ్మె మొదలైనప్పటి నుండి యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శిస్తూ ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరింపులు చేస్తున్నా, ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని కార్మికులు స్పష్టం చేశారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసి ఛైర్మన్ తుల నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం దిగివచ్చి జేఏసితో చర్చలు జరిపి డిమాండ్లు నెరవేర్చాలని, లేనిపక్షంలో కుటుంబాలతో నిరాహార దీక్షలు చేపట్టి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంథని డివిజన్ కార్యాలయం ముందు జరుగుతున్న సమ్మెకు మద్దతుగా ట్రేడ్ యూనియన్లు ఐఎన్టియుసి 327, సిఐటియు, 1104 సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. కార్మికుల పోరాటం మరింత ఉధృతమవుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## హిందూ సమ్మేళన సన్నాహక సమావేశం



**కరీంనగర్ , ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేణికుంట ఉపమండల పరిధిలోని పలు గ్రామాల హిందూ ఉత్సవ సమితి కమిటీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలు, కరపత్రికలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. రేణికుంట, గొల్లపల్లి, లక్ష్మీదేవిపల్లె, నేదునూర్, వచ్చునూర్, రామహనుమాన్ నగర్, జుగుండ్ల గ్రామాలకు చెందిన హిందూ ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రాబోయే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, సమాజంలో ఐక్యతను బలపరచాలని ఈ సందర్భంగా సభ్యులు పిలుపునిచ్చారు.

## పోలీస్ ఉద్యోగాల కోసం.. యువతకు ఉచిత శిక్షణ





టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిరుద్యోగ యువకుల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని టస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని సీఐ గంగాధర్ తో కలిసి ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని అన్నారు. యువత సమయాన్ని వృథాచేయకుండా పట్టుదలతో చదవాలని సూచించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని కోచింగ్ సెంటర్లకు దీటుగా నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగస్తులుగా జీవితంలో స్థిరపడేందుకు ఇది మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక పట్టణాలకు వెళ్లి కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకోలేక తమ కలలను మధ్యలోనే వదులుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అందుకు నిరుపేద యువతకు అండగా నిలవడానికి త్వరలోనే కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కడ్తల్ సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్ మాట్లాడుతూ.. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గ్రామీణ యువత సమస్యలను అర్థం చేసుకుని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువత కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, గ్రామీణ నిరుపేద యువతకు నిజమైన మార్గదర్శకంగా నిలుస్తున్నారని కొనియాడారు, సరైన దిశలో కృషి చేస్తే గ్రామీణ యువత కూడా పోలీస్ శాఖలో ఉన్నత స్థానాలు సాధించగలరని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు తేజీ రామ్. రామ్ చందర్, అమర్ సింగ్,చిట్టి రమేష్ నాయక్, దాస్ నాయక్, రమేష్ నాయక్, వార్డు సబ్యులు ,విశ్వ అకాడమీ లెక్చరర్లు విశ్వ, బిక్షు, లతో పాటు స్థానిక నాయకులు, యువత, జలాల్, సురేందర్, మహేష్, జహంగీర్, రఘు, లింగం, మల్లేష్ నాయక్, నాగేష్ నాయక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు




**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని ఆమనగల్లు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించి, హెల్మెట్, సీట్ బెల్ట్ ను తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని చెప్పారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సైన్లను తప్పనిసరిగా పాటించాలన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్ద పాదాచారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతేనే హారన్ వాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కో అప్షన్ పదవులకు నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు



**ఆమనగల్లు, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కో అప్షన్ సభ్యుల ఎన్నికకు అప్లికేషన్ ల స్వీకరణ గడువు ముగిసింది. మొత్తం నాలుగు పోస్టులకు రెండు మైనారిటీ రెండు జనరల్ గాను 13 అప్లికేషన్ లు వచ్చినట్లు కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం ఆఖరి రోజు కాంగ్రెస్ పార్టీ నుండి అబ్దుల్ ఖాదర్, బిజెపి పార్టీ నుండి చుక్క అల్లాజీ గౌడ్, హలీమా బేగం, కండే సీతమ్మ లు కో అప్షన్ సభ్యులుగా మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్. వైస్ చైర్మన్ తల్లోజు ఆచారి గీత ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. వెరిఫికెట్ స్క్రూటినీ తర్వాత ప్రత్యేక సమావేశం నిర్వహించి కో అప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీ గోరటి నరసింహ, మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్స్ నేనావత్ నిరంజన్, నేనావత్ సునీత ప్రశాంత్, మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, పాలది రవి గౌడ్, కండె భాస్కర్, నాగిళ్ల సందీప్, కిరణ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాల విద్యార్థుల విజయదుందుభి



**వెల్దండ, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని గుండాల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు జదీూజు పదవ తరగతి ఫలితాల్లో అద్భుత విజయాన్ని సాధించారు. మొత్తం 56 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకతతోనే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థిని సి. అక్షిత 700 మార్కులలో 663 మార్కులు సాధించి 95 శాతం ఫలితంతో ప్రత్యేక ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. విద్యార్థిని అక్షితను ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు. ఈ విజయంతో పాఠశాలలో ఆనంద వాతావరణం నెలకొంది.

# వానాకాలం విత్తనాలపై అవగాహన సదస్సు




**గన్నేరువరం, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గుండ్లపల్లి రైతు వేదికలో తెలంగాణ సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వానాకాలం 2026 విత్తనాలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొని, రైతులకు నాణ్యమైన విత్తనం అందించడమే లక్ష్యమని తెలిపారు. దోడ్డు, సన్న రకాల విత్తనాలు సిద్ధం చేశామని, మే మొదటి వారం నుండి సరఫరా చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఏడీఏ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఐఓ అనూష, సాయికుమార్ నిర్వహించారు. గుండ్లపల్లి, గోపాల్పూర్, చీమలకుంటపల్లి, యాస్వాడ, చోక్కారావుపల్లి గ్రామాల సర్పంచులు, రైతులు, డీలర్లు, మహిళా సంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అదే కార్యక్రమంలో డాక్టర్ రాజ్ కుమార్ వ్యవసాయంలో వాడే పారాక్వాట్ గడ్డి మందుపై అవగాహన కల్పించారు. ఈ మందుకు విరుగుడు లేకపోవడంతో, మనిషి సేవిస్తే ప్రాణహాని తప్పదని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికే దీనిని నిషేధించిందని, డీలర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ముందే నిల్వచేసి ఉంటే పిల్లలకు దూరంగా, ఎవరికి తెలియని ప్రదేశంలో ఉంచాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా రైతులు వానాకాలం విత్తనాలపై స్పష్టత పొందడంతో పాటు, ప్రమాదకర రసాయనాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కలిగించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం



**పాలకుర్తి, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం గురువారం ఘన్ శ్యాందాస్ నగర్లోని జీఎం ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు జరగనుంది. ఎంపీడీఓ శశికళ మాట్లాడుతూ, ఇప్పటి వరకు గ్రామాల్లో గుర్తించిన సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి పాలకుర్తి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల స్థాయి మరియు గ్రామస్థాయి అధికారులు, కార్యదర్శులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మక్కజొన్న పంట దగ్ధం




**హుస్నాబాద్ , ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతులు బొల్లి లింగయ్య, లచ్చవ్వ ఆరు నెలల పాటు కష్టపడి పండించిన సుమారు 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న పొలం పూర్తిగా దగ్ధమైపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. సర్పంచ్ గుల్ల రజిత రాజు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని ఆమె కోరారు. గ్రామస్తులు ఈ ఘటనతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభోత్సవం



**గన్నేరువరం, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పటేల్ చెరువులోకి వచ్చే ఫీడర్ కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ కలిసి ప్రారంభించారు. సర్పంచ్ అజయ్ వర్మ మాట్లాడుతూ, నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగకరమని, జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పనికి 7 లక్షల రూపాయలు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మాండ్ల యాదగిరి, పాలకమండలి సభ్యులు కొరివి నాగవ్వ, హనుమాన్ల పద్మ, బూట్ల శ్రీలత, చొక్కల సంగీత, చొక్కల లక్ష్మయ్య, మేట్స్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ పనులు పూర్తి కావడంతో చెరువుకు నీటి సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోలీస్ శాఖ సమక్షంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సులు



కరీంనగర్, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్ సేఫ్టీ--అరైవ్ అలైవ్ కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో విస్తృతంగా జరిగాయి. గంగాధర మండలంలో ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో వివేకానంద పాఠశాల విద్యార్థులతో కలిసి ఎక్స్‌రోడ్ వద్ద మానవహారం నిర్వహించారు. హెల్మెట్ ధారణ, సీట్‌బెల్ట్ వినియోగం, మిత వేగం పాటించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కరీంనగర్ పట్టణంలోని భగత్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద విద్యార్థులు, ప్రజలతో కలిసి రహదారి భద్రత ప్రతిజ్ఞ చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించి, తోటి ప్రయాణికులను గౌరవించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, వివేకానంద స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకుర్తి చౌరస్తాలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే ప్రధాన కారణమని, హెల్మెట్ లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ వినియోగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. గతేడాది జిల్లాలో 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ప్రమాదాల రేటు 17 శాతం తగ్గిందని, 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి ఇస్తుందని, 'రహ వీర్' పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ. 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందుబాటులో ఉందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, స్థానిక ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కరీంనగర్ జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమాలు ప్రజల్లో మంచి స్పందన రాబట్టాయి.

# గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ



**పెద్దపల్లి, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గౌరవాన్ని సాధించారు. 7వ తరగతి విద్యార్థి ఏ. సాత్విక్ తేజ రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంక్ సాధించగా, మొత్తం 9 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు పొందారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారు: డి. శ్రీనికేష్, ఏ. ప్రణవ్, టి. అవ్యాన్ సాయి, కె. వేదశ్రీ, సిహెచ్. సుమతి, కె. శ్రీనిత్య, ఆర్. శివాంశ్, బీ. జశ్వంత్, ఎన్. శ్రీహిత. వీరిలో టి. అవ్యాన్ సాయి ఇప్పటికే మూడు గోల్డ్ మెడల్స్, బీ. జశ్వంత్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. ఈ విజయాలను పురస్కరించుకొని చైర్మన్ అలంకి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రజనీదేవి విద్యార్థులను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలు విద్యార్థులలో లోతైన ఆలోచన, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తాయని, సంస్థ ఎల్లప్పుడూ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక, మ్యాథ్స్ టీచర్ నవ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు విద్యార్థుల విజయాలకు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణను ప్రశంసించారు. ఈ విజయాలు గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించాయి.

## దవాఖాన నిర్లక్ష్యం..
## పాక్‌లో331 మంది పిల్లలకు హెచ్ఐవీ!
### బీబీసీ కథనం.. ఖండించిన పాక్



**ఇస్లామాబాద్ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాకిస్థాన్‌లోని తౌన్సా నగరంలో ఓ ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 331 మంది పిల్లలకు హెచ్ఐవీ సోకిందని బీబీసీ దర్యాప్తులో తేలింది. నవంబర్ 2024–అక్టోబర్ 2025 మధ్య కాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందినట్టు తెలిపింది. సురక్షితం కాని సూదులు వాడటం, సిరంజీలు, వయల్స్ వాడినవే వాడటం వల్ల హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందినట్టు వెల్లడించింది.ఒకే వయల్‌లోని మందును పలువురు చిన్నారులకు ఎక్కించారని వివరించింది. సిరంజీని మార్చకుండా వాడినప్పుడు హెచ్ఐవీ సంక్రమించే అవకాశం ఉందని.. ఇది ప్రమాదకరమని నిపుణులు తెలిపారు. ఇంజెక్షన్లను వేడి నీళ్లలో శుభ్రపరచకుండా వాడినట్టు దర్యాప్తులో తేలింది. 8 ఏండ్ల మొహమ్మద్ అమిన్ అనే పిల్లాడు చనిపోవడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. అయితే దవాఖాన అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. బీబీసీ ఫుటేజీ పాతది లేదా బూటకమైనది కావొచ్చన్నారు. తాము సరైన నియమావళిని పాటిస్తున్నామన్నారు.

## బీహార్ ముఖ్యమంత్రిగా
## సామ్రాట్ చౌదరి ప్రమాణం
### మరో ఇద్దరు మంత్రులు కూడా..




**పాట్నా ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీహార్ నూతన ముఖ్యమంత్రిగా బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. పాట్నాలోని లోక్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సామ్రాట్ చౌదరి చేత గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే, జెడి(యు) సీనియర్ నాయకులు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరీ కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బహుశా ఈ ఇద్దరు నాయకులు ఉపముఖ్యమంత్రులుగా వ్యహరిస్తారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్‌తో పాటు బిజెపి జాతీయ అధ్యక్షులు నితీన్ నబిన్, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, బిజెపి, జెడి(యు) నాయకులు పాల్గొన్నారు.

## కన్యాకుమారి రోడ్ షోలో పాల్గొన్న మోడీ



**కన్యాకుమారి ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగున్నాయి. ఈ నేపథ్యంలో కన్యాకుమారి జిల్లాలో నాగర్‌కోయిల్‌లో బుధవారం జరిగిన రోడ్ షోలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఆయన వెంట తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా నాగర్‌కోయిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మోడీ నివాళులర్పించారు.

## ఇరాన్‌లో 1,104 గంటలుగా
## ఇంటర్నెట్ నిలిపివేత



**టెహ్రాన్‌ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: అమెరికా -- ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇరాన్ అతలాకుతలమవుతుంది. యుద్ధం ప్రారంభమై 47 రోజులవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,104 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ నిలిచిపోయింది. దీంతో ప్రజలకు అంతర్జాతీయ కనెక్టివిటీ లేకుండా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ మేరకు ఇంటర్నెట్ పర్యవేక్షక సంస్థ నెట్ బ్లాక్ తెలిపింది. ఇరాన్‌పై దాడులకు పాల్పడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జనవరిలో హెచ్చరించాడు. ఆ నేపథ్యంలోనే డిజిటల్ సదుపాయం క్షీణించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం వల్ల అప్పటి నుంచి పూర్తిగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అంతర్గత నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నప్పటికీ.. అంతర్జాతీయ డిజిటిల్ సేవలకు అంతరాయమేర్పడింది.


# ఎంపీ వంశీకృష్ణ చుట్టూ స్వార్థపరుల కోట



**పెద్దపల్లి, ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తలకు అవమానం జరుగుతోందని, కొందరు నాయకులు తమ స్వార్థం కోసం గోడలా మారి ఎంపీని కలవనీయకుండా అడ్డుకుంటున్నారని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం ఆవేదన వ్యక్తం చేశారు.మద్దికుంట మాజీ సర్పంచ్ సజ్జద్ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపీని కలిసేందుకు ఉదయం నుంచే వేచి ఉన్న తనను కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఎంపీ చేత పూలమాల వేయించి వెంటనే పంపించివేయడం తనను కలచివేసిందని తెలిపారు.ఎంపీ ఎన్నికల సమయంలో మాదిగ సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ ఉన్నప్పటికీ, వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా 30 మందితో కమిటీగా ఏర్పడి పనిచేశానని, సొంత వర్గాన్ని పక్కన పెట్టి మాల వర్గానికి చెందిన వంశీకృష్ణకు అండగా నిలిచిన మొదటి వ్యక్తి తానేనని కైలాసం పేర్కొన్నారు.మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబంపై గౌరవంతోనే తాను పనిచేసినా, నేడు అదే మాదిగ వర్గం ముందు తనను అవమానించడం సమంజసం కాదని ప్రశ్నించారు. వంశీకృష్ణ యువ నాయకుడిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించాలని కోరుకుంటున్నానని, అయితే సజ్జద్ వంటి వారు స్వార్థం కోసం నాయకులను ప్రజల నుంచి వేరు చేస్తున్నారని విమర్శించారు. నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలను దూరం చేస్తే పార్టీ నష్టపోతుందని, తనకు జరిగిన అవమానం మరెవరికీ జరగకూడదని ఆయన అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇలాంటి స్వార్థపరుల తీరుపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం..

### పడవ మునిగి 250 మంది గల్లంతు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అండమాన్ సముద్రం లో ఘోర ప్రమాదం జరిగింది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తున్న ఓ పడవ నీటిలో మునిగిపోయింది . ఈ ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది.ప్రమాదానికి గురైన పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లోని టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఐక్యరాజ్య సమితి తన ప్రకటనలో పేర్కొన్నది. పడవ బంగ్లాదేశ్ నుంచి మలేసియా వెళుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించింది. అదేవిధంగా పడవలో పరిమితికి మించి జనం ఎక్కడం కూడా ప్రమాదానికి మరో కారణమై ఉండవచ్చని తెలిపింది. మునిగిన పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదానికి గురైనట్లు ఐక్యరాజ్యసమితి అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు మయన్మార్‌కు చెందినవారు. కానీ 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది మంది బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దాంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే ఇటీవల అక్కడి పరిస్థితులు కూడా క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను వారు ఎంచుకుంటున్నారు.

# నాటో కూటమి గతంలో లేదు..
# భవిష్యత్తులో కూడా ఉండదు



**న్యూఢిల్లీ ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్ తో యుద్ధం చేసే విషయంలో, హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన.. తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు.అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులో ఉండబోదని అసహనం వ్యక్తంచేశారు. కాగా గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు. మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో–14 (గ్రాశీజూవ ౭ావశీ), అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు.పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. యూరప్ ప్లాన్ బీపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే.. ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

# నెలసరి సెలవును -కచ్చితంగా,
# విశ్వసనీయం'గా అమలు చేయాలి




**బెంగళూరు ఏప్రిల్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నెలసరి సెలవును -కచ్చితంగా, విశ్వసనీయంగా' అమలు చేయాలని కర్ణాటక హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెలసరి సెలవు(ఎంఎల్)పై ప్రతిపాదిత చట్టం అమల్లోకి వచ్చే వరకు, 18 నుండి 52ఏళ్ల వయస్సుగల మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో ఒక రోజు సెలవును మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేసే ఎంల్ విధానాన్ని సంబంధిత సంస్థలు కచ్చితంగా, విశ్వసనీయంగా అమలు చేసేలా చూడాలని ఆదేశించింది. బెళగావి జిల్లా, గోకాక్ తాలూకా ముదల్గిలోని ఒక హోటల్ లో పనిచేస్తున్న 41ఏళ్ల చంద్రవ్వ హనుమంత్ గోకవి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ ఉత్తర్వును జారీ చేశారు. కర్ణాటక నెలసరి సెలవు, పరిశుభ్రత బిల్లు, 2025 ప్రతిపాదిత చట్టంగా ఆమోదం పొందిన వెంటనే ఈ ఆదేశాన్ని పూర్తిస్థాయిలో, అర్థవంతంగా అమలు చేసేందుకు ఎటువంటి అనవసర జాప్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిబంధనలను రూపొందించాలని కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 14ను లోతుగా విశ్లేషించకుండా ఇచ్చిన ప్రస్తావన ఆధారంగా ఏర్పడిన నిరాధారమైన భయాలతో రాష్ట్రం వెనకడుగు వేయకూడదని లేదా పరిమితం కాకూడదని కోర్టు పేర్కొంది. చట్టం దృష్టిలో స్త్రీ పురుషులు సమానులే, కాని వారు జీవశాస్త్ర పరంగా విభిన్నమైన వారు. ముఖ్యంగా ఆరోగ్యం, గౌరవం, శారీరక స్వేచ్ఛకు సంబంధించిన విషయాలను గుర్తించడం అనేది సమానత్వ హామీని ఉల్లంఘించడం కాని, దానికి ఒక వాస్తవిక అర్థాన్ని ఇవ్వడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఫ్యాక్టరీల చట్టం, 1948, కర్ణాటక దుకాణాలు, వాణిజ్యసంస్థల చట్టం, 1961, తోట కార్మికుల చట్టం, 1951, బిడి,సిగార్ కార్మికుల (ఉద్యోగ నిబంధనల) చట్టం,1966, మోటారు రవాణా కార్మికుల చట్టం, 1961కింద నమోదైన సంస్థల్లోని శాశ్వత, కాంట్రాక్ట్ , అవుట్ సోర్స్ మహిళా ఉద్యోగులందరికి ఎంఎల్ అందుబాటులో ఉంటుందని గతేడాది నవంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నోటిఫికేషన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్, కర్ణాటక ఎంప్లాయర్స్ అసోసియేషన్, బెంగళూరు ఎంప్లాయర్స్, 15మంది మహిళా ఉద్యోగులు పిటిషన్లు దాఖలు చేశారు. ఎంఎల్ విధానానికి మద్దతు ఇస్తూ వివిధ ట్రేడ్ యూనియన్లు, మహిళా న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్లు కోర్టులో మరో జడ్జి ఎదుట విచారణలో ఉన్నాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం తనకు ఎంఎల్ మంజూరు చేయడం లేదని, గతేడాది నవంబర్ లో జారీ చేసిన నోటిఫికేషన్ అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేయాలని చంద్రవ్వ తన పిటిషన్ లో పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లోని ఉద్యోగులకు ఈ విధానం గురించి తెలియదని, దీంతో మహిళలను నియమించుకునే సంస్థలు ఉద్యోగులకు ఈవిధానంపై అవగాహన కల్పించాలని లేదా ఎంఎల్ అమలులో ఉన్న విషయాన్ని తెలియజేయాలని కోరారు. దీంతో మహిళలు ప్రయోజనాన్ని పొందగలరని పిటిషన్ లో ఉద్ఘాటించారు.